# భగవన్నామమును విడనాడకండి

పూలయందున పరిమళమెట్లు గలదొ
అటుల దేవుండు నీలోన కలడు జూడ
మెదడు చెడిపోయి కస్తూరి మృగమువోలె
ఏల వెతికెదు దేవుని వెఱ్ఱివాడ!

కట్టెలందున నిప్పులు కల్గునటుల
తిలలయందున తైలంబు వెలయుపగిది
ఎందు చూసిన దైవంబు నిండి యుండె
ఎచట వెదకెదు దేవుని వెఱ్ఱివాడ!

ప్రేమ స్వరూపులారా!

ప్రపంచములో ప్రతికణమునందును ప్రతిష్ఠయైవున్న దివ్యత్వమును మానవుడు గుర్తించుకోలేకపోతున్నాడు. ప్రపంచమంతయుకూడను దివ్యమైనటువంటిది ఈశ్వరస్సర్వభూతానాం. ఇట్టి సత్యాన్ని ప్రతిమానవుడు చక్కగా విచారణ చేసిన తనకు ఇట్టి దివ్యత్వము బోధపడుతుంది. భౌతికమైన ఈ జగత్తునందు లౌకికమైన పరిశీలనలోపల సమస్తమును అర్థముగావించుకొని కేవలం తనయందున్న దివ్యత్వమును మటుకు విస్మరించి మానవుడు జ్ఞానివలె ప్రకటితం చేస్తున్నాడు.

మానవుడు ఈ జగత్తునందు చేయు ప్రతికర్మకూడా ఒక యజ్ఞముతో సమానము. బయట చేయు కర్మలన్నీ అంతర్ముఖమైన కర్మలయొక్క ప్రతిబింబములే. బయట కర్మయజ్ఞము. లోపల బ్రహ్మయజ్ఞము. కాని యజ్ఞతత్త్వము చక్కగా గుర్తించి వర్తించటం వ్యక్తులకు అర్థంకావటం లేదు. మానవత్వమునందెట్టి దివ్యత్వము ఇమిడియున్నదో అట్టి దివ్యత్వమే సర్వత్రా వ్యాపించిన పరతత్త్వమనే సత్యాన్ని వారు గుర్తించుకోటానికి ప్రయత్నించటం లేదు. దేహేంద్రియములే ప్రధానమని భావించి వాటిని తృప్తి పరచుటకు తగిన భోగభాగ్యముల నిమిత్తమై మానవుడు

srisathyasaivachanamrutam

తనకాయమును కాలమును కర్మనుకూడా వ్యర్థము గావించుకుంటున్నాడు. భౌతిక జీవితములో ఏర్పడిన సుఖసంతోషములు మానవునకు తృప్తినిచ్చుచున్నవాయని విచారణ చేసిన ఏమాత్రం తృప్తిని కలిగించటం లేదు. కేవలం ఆధ్యాత్మిక మార్గంలో మనం విచారణ సలిపిన ఒకటి ఆనందము, రెండవది సంతోషము. ఈ సంతోషము సుఖముద్వారా ఏర్పడిన దేనిని భావిస్తున్నారు. ప్రపంచములోపల సమస్త పదార్థములు సుఖమును మాత్రము అందించగలవుగానీ ఆనందమును అందించలేవు. ఆనందమన్నది వస్తువుల యందుగాని, విషయములందుగాని, వ్యక్తులయందుగాని కానరాదు. ఆనందమన్నది తననుండి ఆవిర్భవించేటువంటి ఆత్మతత్త్వమే తప్ప అన్యము కాదు. మార్పుచెందే పదార్థములు మార్పుచెందని పరతత్త్వమునేరీతిగా అందించగలవు. కనుకనే ఇట్టి నిత్యసత్యమును గుర్తించుకునే నిమిత్తమై వేదములందు అనేకరకములైన మార్గములు ప్రబోధిస్తూ వచ్చాయి.

మానవునియందిట్టి పశుత్వమైన భావములు గుణములు అభివృద్ధి కావటానికి కారణమేమిటని విచారించమని మొట్టమొదటి ప్రశ్న వేసింది వేదము. పుట్టిన తక్షణమే మానవుడు మానవునిగా జన్మించటం లేదు. ఈ మానవత్వమునకు పూర్వము అనేక జంతులక్షణములు జంతు జన్మములు కూడా ఎత్తి కట్టకడపటికి ఈ మానవజన్మలో ప్రవేశిస్తున్నాడు. కనుకనే శేషించిన యీ పశులక్షణాలు మనలో ఉండటము చేత ఈ విధమైన దుర్గుణములు ఆవిర్భవిస్తున్నాయి. ఒకరు చూసిన నిరంతరము చంచల చిత్తులై కేవలం స్థిరత్వము లేక తాను జీవిస్తూ ఉంటాడు. ఆ స్థిరత్వము నిమిత్తమై అనేక ప్రయత్నములుగావిస్తూ ఉంటాడు. కాని స్థిరత్వం ఏర్పడటం లేదు. దినదినమునకు ఈ చంచలత్వమే అభివృద్ధి అవుతుపోతుంది.

దీనికి కారణమేమని విచారించినప్పుడు వేదమే దీనికి సరైన జవాబు నందిస్తూ వచ్చింది. పూర్వము తాను కోతి జన్మముగా రూపొందటము చేత ఆకోతి యొక్క లక్షణములు తనలో ఉండి ఈ చంచలత్వానికి మూలకారణమైందని జవాబు ఇస్తుంది. అదేవిధముగనే మానవునియందు మూర్ఖత్వము లేక పిరికితనముగాని లేక దొంగబుద్ధిగాని ఇంకే విధమైన ఈ దుర్లక్షములంతా కనుపించి నాయంటే దీనికి మూలకారణము. పూర్వము తాను యీవిధమైన జంతు జన్మములో శేషించిన శేషములే ఈ ప్రవర్తనకు మూలకారణమని అర్థమవుతుంది.

sri sathyasai vachanamrutam

ఇట్టి దుష్ట సంస్కారములను మనము భగవదర్పితముగావించటమే దీనికి సరైన పరిహారమని నిర్ణయిస్తుంది. దొంగతనమనే గుణము మనిషిలో అనేక మందికి ఆవిర్భవిస్తూ ఉంటుంది. ఈ దొంగ తనమనేది పిల్లి యొక్క లక్షణములు చంచలత్వమనేది కోతియొక్క లక్షణములు. మూర్ఖత్వము గొఱ్ఱె యొక్క లక్షణము. మదము అనే గుణము దున్నపోతు లక్షణము. ఈ విధముగా పూర్వజన్మ సంస్కారము పురస్కరించుకొని దానియొక్క స్వభావములే సంస్కారముగా మారి మానవునియందు చిత్రింపబడుతూ ఉంటున్నాయి.

యజ్ఞములో రెండు విధములైన యజ్ఞములు కలవు. ఒకటి బాహ్య సంబంధమైన యజ్ఞము, రెండవది అంతరసంబంధమైన యజ్ఞము ఈ బాహ్య సంబంధమైన యజ్ఞమునకు కొన్ని వేదికలు, పురోహితులు, సమిధలు, దీనికి తగిన పదార్థములు అత్యవసరం. ఈ మంత్రముల చేత స్వాహాకారములచేత అర్పితము గావిస్తూ ఉంటారు. హోమం చేస్తూ ఉంటారు. ఇది అంతర్ముఖమైన యజ్ఞముయొక్క ప్రతిబింబమే. అయితే అంతర్ యజ్ఞముయొక్క విషయము ఏమాత్రం కూడా విచారించటంలేదు. తన యందున్న దైవత్వాన్ని స్మరించి, తన మనసునే యజ్ఞ వేదికగా నిర్మించి దానియందు పరివేష్టించిన దుష్టగుణములను బలిచేయటమే యజ్ఞముయొక్క అంతర్భావము. కనుకనే దుష్టగుణములను, దుష్ట స్వభావమును, దుష్ట ప్రవర్తనను మనం మార్చుకొని దివ్యమైన మానవత్వాన్ని ప్రకటితంగావించుకునే నిమిత్తమై ఏర్పడినవే ఈ యజ్ఞములు. చంచలత్వము మానవునియొక్క స్వభావము కాదు. క్రోధము మానవునియొక్క స్వభావము కాదు. దొంగతనముకూడను మానవునియొక్క స్వభావము కాదు. మూర్ఖత్వమంతకంటే మానవుని స్వభావము కాదు. ఇవన్నీకూడా మానవునియొక్క స్వభావం కాని దుర్గుణములన్నింటిని మానవుడు అనుభవిస్తున్నాడంటే దీనికి మూలకారణము పూర్వజన్మ సంస్కార ఫలములే. కనుక మనం చేయవలసిన త్యాగమేమంటే మనలో నిండిఉన్న, మనలను బాధించే, మానవత్వాన్ని మరపింపచేసే ఈ దుర్గుణములను మనం త్యాగము చేయాలి.

దీనికి చక్కని ఉదాహరణము. మనలో ఒకవిధమైన ఆశ్రమము ఉంది. ఈ ఆశ్రమమనగా ఏమిటి? శ్రమమును పోగొట్టేది ఆశ్రమము. ఆశ్రితులను రక్షించేది ఆశ్రమము. ఆశ్రితాన్ని చేకూర్చేది ఆశ్రమము. మన అభీష్టములు నెరవేర్చేది ఆశ్రమము. అయితే ఇది సామాన్యమైన

srisathyasaivachanamrutam

ఆశ్రమము కాదు. నేను నేను అనే ప్రజ్ఞ ఎక్కడ నుడి ఆవిర్భవించిందో దానినే ఆశ్రమము అన్నారు. సమస్త అభీష్టములను సిద్ధింపచేసే ఈ ఆశ్రమమునే సిద్ధాశ్రమము అని పిలుస్తూ వచ్చారు. ఈ సిద్ధాశ్రమములో విశ్వామిత్రుడు ఉండేవాడని చరిత్ర. ఈ విశ్వామిత్రుడంటే ఎవరు? కేవలము ఒక వ్యక్తియా? ఒకమునియా? లేక ఒక ఋషియా? కాదు కాదు. అతని యందున్న ప్రజ్ఞానశక్తిని ప్రభువుపైన మరల్చినప్పుడు తానే విశ్వామిత్రునిగా మారతాడు. అట్టి తమ దృష్టి దివ్యత్వంపై మరల్చే యజ్ఞం గావించాలని తాను ప్రయత్నం చేస్తాడు. ఈ యజ్ఞ సంరక్షణ నిమిత్తమై రామచంద్రుని ప్రార్థిస్తాడు. ఆ రాముడెవరు? కేవలం ఒక వ్యక్తి స్వరూపుడు కాదు. ఆత్మనురమింపజేసే గుణము కలవాడు. కనుక అతనికి ఆత్మరాముడని బిరుదు. ఈ ఆత్మనాశ్రయించినప్పుడు తన యజ్ఞము సఫలీకృతమవుతుందనే విశ్వాసం విశ్వామిత్రునికి. కనుక అట్టి దృష్టిని దివ్యత్వంపై మరల్చటం చేత రాముడు అక్కడ ఆవిర్భవిస్తాడు. అక్కడ ఆవిర్భవించి మారీచ, తాటకిని హతమారుస్తాడు. ఈ మారీచ తాటకులెవరు. ఇవే రాగద్వేషములు. ఈ రాగద్వేషములను ఏనాడు హతము గావించునో అప్పుడు విశ్వామిత్రుని యాగము పరిపూర్ణమైంది. కనుక మానవునియందే సర్వము ఇమిడి ఉంటున్నాయి.

**మానవుడు కూడా వేదరూపుడే**

మానవుని యొక్క వాక్కే ఋగ్వేదము. మనసే యజుర్వేదము. ప్రాణమే సామవేదము. మూడింటియొక్క ఏకత్వమే దివ్యమైన ఆత్మతత్త్వము. కనుక ఋగ్వేద, యజుర్వేద సామవేదములన్నీ కేవలం ఒక స్వరూపము ధరించిన మానవత్వమే. మానవునియందే సర్వము ఇమిడి ఉంటుంది. మానవుని యందులేని దివ్యత్వము ఇంక ఎక్కడా మనకు కనుపించదు. సమస్త శక్తులకు నిలయుడు మానవుడు సమస్త దివ్యగుణములకు నిలయము మానవుడు. అట్టి మానవుని మనవునిగా గుర్తించక దానవునిగా ప్రవర్తించటం ఇది సరియైనది కాదు. కావున ఇట్టి మానవునియందు నిరంతరము బ్రహ్మయజ్ఞం జరుగుతూనే ఉంది. ఇది సర్వకాల సర్వావస్థలయందు ఈ నామ ఉచ్చారణ జరుపుతూ ఆహుతి సల్పుతూనే ఉంటుంది. స్వహాకారములు సల్పుతూనే ఉంటుంది. ఆ స్వాహాకారమే శ్వాసాకాము. అదే సోహం, సోహం ఈ శ్వాసయందున్న సోహం నేనేదైవము నేనే దైవము అనే దివ్యమైన మంత్రం చేతనే ఆహుతి

sri sathyasai vachanamrutam

చేస్తున్నది. కనుక వేదములనేవి కేవలం ఒక గ్రంథరూపంలో కాకుండా మానవునియందు భావరూపములో ఇమిడి ఉంటున్నాయి.

దీనికి మరొక ఉదాహరణము. యజ్ఞములో మాటిమాటికి ఇంద్రుని ఆహ్వానం చేస్తూఉంటారు. ఈ ఇంద్రుడనగా ఎవరు? ఏదో ప్రత్యేకమైన దేవతకాదు. ఇంద్రియముల కధిపతి. మన మనస్సే ఇంద్రుడు. ఈ ఇంద్రునికి మరొకపేరు కూడా ఉంది పురుహూతుడు అని. పురు అనగా మాటిమాటికి పిలవటం. హూతుడు అనగా ఆహ్వానం చేయటం, అనేక పర్యాయములు ఆహ్వానం చేయించుకునే వాడు కనుకనే ఇతనికి పురుహూతుడు అని మరొకపేరు. ఈ ఇంద్రునికి మరొక పేరు కూడా ఉంది. రుద్రుడు, ఇంద్రియములకధిపతిగా ఉన్న వయస్సు ఇంద్రునిగాను ఇంద్రియములను స్వాధీనం చేసుకున్న, సర్వత్రా వ్యాపించిన తత్త్వమునకే రుద్రుడు అని పేరు. ఏతావాతా మనస్సు, ఇంద్రుడు, రుద్రుడు ఒక్కరే. ఆయా కర్మలాచరించే సమయములో ఆయా పేర్లను ధరిస్తుంటుంది.

ఒకచిన్న ఉదాహరణము. లౌకిక జగత్తునందు చిన్న ఆదర్శమును తీసుకుందాము. ఒక బ్రాహ్మణుడు ఉంటాడు. ఒక దేవాలయములో పూజ చేస్తూఉంటాడు. అతనిని పూజారి బ్రాహ్మణుడని అంటారు. ఇంకొక చోట పంచాంగము చదువుతూ ఉంటాడు అనిని పంచాంగం బ్రాహ్మణుడంటారు. మరొకచోట వంట చేస్తుంటాడు అతనిని వంట బ్రాహ్మణుడంటారు. మరొక చోట విద్యనేర్పుతూ ఉంటాడు. అక్కడ అధ్యాపక బ్రాహ్మణుడంటారు. ఈ పనులను బట్టి ఈ పేర్లు వచ్చాయిగాని అందరూ బ్రాహ్మణులే. అదేవిధముగానే మనసు, ఇంద్రుడు రుద్రుడు అనేవి వారు చేసే కర్మలను పురస్కరించుకొని వారికి పేర్లు వచ్చాయి. కనుక క్రియారూపంలో ఆవిర్భవించే దివ్యత్వాన్ని బట్టియే మనయొక్క మంచిచెడ్డలు కూడా రూపొందుతూ ఉంటాయి. కనుక అన్నింటికిని కర్మయే ప్రధానము. కనుక వేదమునందు కర్మకాండను ప్రధానమైన స్థానములో పెట్టారు, ఇట్టి కర్మకాండయందే దివ్యమైన మానవాకారము కూడను నిరూపిస్తూ వచ్చింది.

దశరథుని ఇంటిలో రామలక్ష్మణ భరత శతృఘ్నులనే నల్గురు బాలురు నిరంతరము సంచారం సల్పుతుంటారు. ఆడుతూ ఉంటారు. పాడుతూ ఉంటారు. ఆనందిస్తూ ఉంటారు.

sri sathyasaivachanamrutam

ఎవరు వీరు అని విచారణ చేస్తే వేదమే వీరియొక్క స్వరూపాన్ని నిరూపణగావిస్తూ వచ్చింది. సాక్షాత్తు ధర్మమునే ఆకారముగా ధరించినవాడు రాముడు. ఇతడే యజుర్వేదము. ఈ యజుర్వేదమనే రామనామమును ఆశ్రయించి తన వాక్యమును తన కార్యమును నిరంతరం వల్లెవేసేవాడు లక్ష్మణుడు. ఇతనే ఋగ్వేదము. రామనామమునే ఒక గానముగా ఉచ్చరించుకుంటూ, ఈగానములో తన జీవితమును లీనము గావించుకున్న వ్యక్తి భరతుడు. అతడే సామవేదము. అంతర్ బహిర్ శక్తులను అణగద్రొక్కి ఈ ముగ్గురి ఆజ్ఞలను శిరసావహించి శతృసంహారం గావించిన శతృఘ్నుడే అధర్వణవేదము. కనుక ఋగ్వేద, సామవేద, యజుర్వేద, అధర్వణ వేదములన్నీ కూడను రామలక్ష్మణ భరత శతృఘ్నుల స్వరూపములో ఈ దశరథుని ఇంటిలో ఆడుకుంటున్నారు. అయితే ఈ దశరథుడు ఎవరు? ఇతనొక చక్రవర్తికాడు. ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములు ఈ దశేంద్రియములు చేరిన రథమే ఈ దేహము. ఇదే దశరథుడు. దశేంద్రియ రథమైన ఈ దేహమునందు ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణ వేదములనే బాలురు రామలక్ష్మణ భరత శతృఘ్నులుగా ఆవిర్భవించారని అర్థము. వీరు సూర్యవంశపు వారని పేరు. ఇక్కడ సూర్యుడనగా బాహ్య సంబంధమైన రూపములో మనం విచారించినప్పుడు సూర్యుడున్నాడు చంద్రుడున్నాడు. భూమి ఉన్నది.

**మీరంతా రామ స్వరూపులే**

ఈ భూమి ఎక్కడ నుండి వచ్చినది? సూర్యుని నుండి వచ్చినది. ఈ చంద్రుడెక్కడనుండి వచ్చాడు? భూమినుంచి వచ్చాడు. కనుక చంద్రుడు, భూమి సూర్యుని నుండి ఆవిర్భవించినవే. సూర్యునిలోని కొన్ని భాగములే. నిజముగా విచారణ చేస్తే సూర్యుడే లేకపోతే ఈ జగత్తేలేదు. జనన మరణములే లేవు. ఏ విధమైన ఆకారమే లేదు. కనుక సూర్యుని ప్రధానమైన దేవతగా ఆశ్రయిస్తూ వచ్చారు. సూర్యుడే ప్రత్యక్షదైవంగా విశ్వసిస్తూ వచ్చారు. ఈ సూర్యునియొక్క అంశములు ప్రతి మానవునియందు ఉంటున్నవి. ప్రతిమానవుడు కూడను సూర్యునియొక్క కిరణములనుండి ఆవిర్భవించినవాడే. మనలో ఉన్నవెలుగే సూర్యునియొక్క కిరణము. అతని వెలుగు మనలో ఉండటంచేత అతని అంశము కూడను మనలో ఉంటున్నది. సూర్య అంశమైన ప్రతిమానవుడు కూడను సూర్యవంశమునకు చెందినవాడే.

sri sathyasai vachanamrutam

రాముడు ఎవరంటే సూర్యవంశము వాడన్నారు. కనుక ప్రతి మానవునియందు ఆత్మారామ అనే తత్త్వము సూర్య అంశముతో కూడినది కనుక అది సూర్యవంశముగా రూపొందింది. కనుక రాముడనగా కేవలము దశరథ మహారాజు కుమారుడే కాదు. మీరందరూ రామ స్వరూపులే. మీ అందరియందు ఈ సూర్యవంశము నిలచి ఉన్నది. అట్టి సూర్య అంశమునే సూర్యవంశముగా విశ్వసించి సూర్యవంశపు రాజైన రామచంద్రుడే విధముగా దుష్టసంహారం గావించాడో, శిష్టపరిపాలన గావించాడో అటులనే మీయందున్న దురాలోచనలు, దుర్గుణములు, దుర్బుద్ధులను సంహరించి సద్గుణములను, సదాచారములను పోషించటానికి కృషి చేయండి. ఇదే ప్రతి మానవుడు ప్రతిక్షణమందు చేయవలసిన యజ్ఞము.

కనుక యజ్ఞమనగా కొన్నివేదికలు నిర్మించి, ఋత్విక్కుల నాహ్వానించి తద్వారా అనేక ద్రవ్యములనంతా ఆహుతిచేసి ఈ విధముగా మంత్రములుచ్చరించటం మాత్రమే కాదు. కేవలం ఉపాధి భేదముల చేతనే మనం ఇన్ని విధములైన అపమార్గములను పడుతున్నాము. ఉపాధి భేదములను మనం త్యజించినప్పుడు అందరియందు దివ్యత్వమైన చైతన్యము ఒక్కటిగానే ఉంటుంది. ఇక్కడ సజాతి, విజాతి, స్వగత భేదములున్నాయి. సజాతి అనగా ఏమిటి? మనం ప్రాకృతంగా చూచినప్పుడు చెట్టు చెట్టు ఈ రెండూ స్వజాతి. అదియే చెట్టైనాకాని. వేపచెట్టు కావచ్చు. మామిడి చెట్టు కావచ్చు. రావి చెట్టుకావచ్చు. చెట్టు చెట్టే. అది స్వజాతి భేదముగాని పేర్లు వేరువేరుగా ఉండవచ్చును. ఇది వృక్షజాతి. ఇది సజాతి. జాతి అనగా ఇక్కడ వృక్షమునకు, ఒక శిలకు సంబంధము లేదు. ఇది విజాతి భేదమన్నారు. స్వగత భేదమనగా ఏమిటి? మనం ఒక విత్తనం నాటేటప్పటికి అది అనేక కొమ్మలతో రెమ్మలతో అభివృద్ధి అవుతుంది. అది శాఖోపశాఖలుగా రూపొందుతుంది. ఇందులో ఎన్నో ఆకులు, పులు, కాయలు రూపొందింపచేస్తుంది. అయితే ఎన్ని కొమ్మలుండినా, ఎన్ని ఆకులు, ఎన్ని పూలు, ఎన్ని కాయలుండినప్పటికి ఇవన్నీ ఒక విత్తనమునకు సంబంధించినవేగాని అన్యముకాదు. దీనినే స్వగత భేదమన్నారు. ఈ మూడింటియొక్క అంతరార్థము ఏమిటి? రూపనామములు తీసివేస్తే అన్నింటియందు ఉన్న చైతన్యమొక్కటే.

ఇది ఆకు అన్నాము. ఈ ఆకు ఎక్కడనుండి వచ్చింది. ఆ విత్తనము నుండే వచ్చింది.

srisathyasaivahini.org

ఇది పువ్వు అన్నాము. దాని రూపనామములు వేరుగా ఉండవచ్చును. కాని విత్తనం ఒకటే. ఏకత్వములో అనేకత్వము ఇమిడి ఉంటున్నది అనే సత్యానికి ఇదే ప్రమాణము. ఇలాంటి విషయములను వేదము అనేకంగా నిరూపిస్తూ వచ్చింది. కాని ఈవేదమునందున్న అంతరార్థములుగాని మానవుడు గుర్తించటానికి తగిన ప్రయత్నము చేయటంలేదు. కనుక ప్రతి దానియందు కూడను ఒకదానికొకటి సన్నిహిత సంబంధ బాంధవ్యమేర్పడి ఉంటుంది. సూర్యుడే లేకపోతే భూమియేలేదు. భూమిలేకుంటే చంద్రుడే లేడు. సూర్య భూమి, చంద్రులే లేక జగత్తే లేదు. ఈ రూపనామములు వేరువేరు అయినప్పటికిని దివ్యత్వము ఒక్కటిగానే ఉంటుంది. అట్టి దివ్యత్వాన్ని గుర్తింపచేసే నిమిత్తము పూర్వము ఈ యజ్ఞయాగాదులు ప్రారంభమయ్యాయి. కానీ దీనియొక్క అంతరార్థమును మానవులెవరు విచారించక కేవలము బాహ్యమైన కర్మలను మాత్రం దృష్టియందుంచుకొని ఇదంతా కేవలము ధనము వ్యర్థం చేస్తున్నారనే భావములో దీనిని తిరస్కరిస్తున్నారు. మానవత్వమునకు మించిన దివ్యత్వము మరొకటి లేదు.

### మానవునిలో దివ్యత్వము ఉన్నది

మానవునికంటె గొప్పవాడు మరొకడు ఈ జగత్తులో లేడు. మానవుని కంటె విలువైన వస్తువు ఈ జగత్తులో మరొకటి లేదు. ఒక వస్తువుకు గని, ఒక వజ్రమునకుగాని లేక బంగారమునకుగాని వెలకట్టే వాడెవరు? మానవుడే. ప్రపంచములో ఏ విలువైన పదార్థములున్నాయో, వీనికి విలువకట్టే వాడు మానవుడే. అన్నింటికి విలువకట్టే మానవునకీనాడు విలువలేకుండా పోయింది. కారణమేమనగా తనయొక్క స్వరూపాన్ని తాను మరచిపోవటమే. స్వరూపాన్ని మరచిపోవటం కేవలము ఒక విధమైన భావరూపాన్ని మాత్రం విశ్వసించి తద్వారా బాహ్యమైన ఉపాధినే ఆశ్రయిస్తూ వస్తున్నారు. ఈ అనిత్యము, అశాశ్వతముయైన దేహమునందే నిత్యసత్య నిర్మలమైన దివ్యత్వము ఉన్నదనే సత్యాన్ని వారు గుర్తించటం లేదు.

దేహమునందే దేహి ఉన్నాడు. శరీరమునందే శరీరి ఉన్నాడు. ఈ క్షేత్రమునందే క్షేత్రజ్ఞుడు ఉన్నాడు. క్షేత్రజ్ఞుడే లేకపోతే క్షేత్రమునకేమీ విలువ లేదు. కానీ క్షేత్రమనే బండికి విలువ ఇస్తున్నారు. కానీ క్షేత్రజ్ఞుడనే గుఱ్ఱమును పోషించటం లేదు. గుఱ్ఱమును వెనుక పెట్టి బండిముందు

srisathyasaivachanamrutam

వస్తే ప్రయాణం ఎలా సాగుతుంది. అదే విధముగనే ఈనాడు దివ్యత్వమైన ఆత్మతత్త్వాన్ని వెనుక పెట్టి కేవలం బండివంటి దేహమును మాత్రమే ముందు పెట్టి జీవితయాత్ర సలుపుతున్నాడు. తద్వారా గమ్యమును వీడు చేరలేకపోతున్నాడు. కనుక మానవత్వంలో ఉన్న పవిత్రతను ఈ వేదము ద్వారా మనం గుర్తించటానికి ప్రయత్నించాలి. వేదమనగా విద్యుస్వరూపము. విద్యుత్ కరణము విద్యాసారము. వేదము, వేదాంగము వేదవిదుడు ముచ్చరూ ఒక్కటే అనే ఏకత్వాన్ని నిరూపిస్తూ వచ్చింది. ధ్యానము, ధేయము, ధ్యాస ఈ ఏకత్వమే విధముగా మనకు సంభవిస్తుందో అదేవిధముగనే దివ్యత్వము పవిత్రము ప్రకృతియొక్క తత్త్వము మూడింటియొక్క ఏకత్వం మనకు ప్రాప్తిస్తుంది.

కనుక ప్రతి మానవుడు తనలో ఆవిర్భవించే భావములకు, భావములకు తగిన పలుకులకు, పలుకులుకు తగిన క్రియలకు మూడింటికి సంబంధమేర్పరచు కోవాలి. దీనినే The proper study of mankind is man అన్నారు. మనిషి అంటే ఏమిటి? తన తలంపులు, పలుకులు, క్రియలు మూడింటిని ఏకం గావించాలి. అదియే వేదమంత్రమునందు

**త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రంచ త్రియాయుధం**
**త్రిజన్మపాప సంహారం ఏకబిల్వం శివార్పణం**

అన్నారు. దీనిని పురస్కరించుకొని చెప్పారు. మనదేహము, పుష్పం, మన హృదయం ఫలం- మన మనస్సు. తోయం-మన ఆనందబాష్పములు. వీటిని భగవదర్పితము గావించమని కోరింది. ఈనాడు లోకములో ధనవంతుడున్నాడు. గుణవంతుడున్నాడు. బలవంతుడున్నాడు. విద్యావంతుడున్నాడు కానీ ఆత్మవంతుడు కనుపించటం లేదు. ఆత్మ భావమును మరచి ఈ ధనము, బలము, గుణము ఎంత కాలం నిన్ను ఆశ్రయిస్తాయి మన దేహబలమనేది కేవలం తెల్లవారి విచ్చిన పువ్వు సాయకాలమునకు వాడిపోయినట్లుగా దేహం వృద్ధాప్యం పొందుతుంది. మన దేహముయొక్క బలము, ఆస్తిపాస్తులు ఎప్పుడు పోతాయో ఎప్పుడు వస్తాయో తెలీదు. కనుక ఇవన్నీ అశాశ్వతమైనవే? ఇటువంటి అశాశ్వతాన్ని శాశ్వతంగా విశ్వసించి, శాశ్వతాన్ని అశాశ్వతముగా భావించి మానవుడిన్ని విధములైన దుఃఖములకు గురౌతున్నాడు.

ప్రేమస్వరూపులారా!

sri sathyasai vachanamrutam

**ఎద్ది కలదనుచుంటిరో అద్దిలేదు**
**ఎద్దిలేదనుచుంటిరో అద్దికలదు**
**ఉన్న దొక్కటె దైవంబు ఎన్నటికిని**
**మరువబోకు డిట్టి మంచిమాట!**

ఉన్నది ఉన్నది అనుకుంటున్నాం. ఉన్నదంతా కూడా లేనిదే. ఎంతవరకు మనకు సత్యంగా ఉంటుంది. జాగ్రత్తగా చూసినది నిద్రలో మరచిపోతున్నాము. స్వప్నములో కనుపించినది జాగ్రత్తగానే అలక్ష్యము చేస్తున్నాము. జాగ్రత్తది స్వప్నంలో లేదు. స్వప్నమది జాగ్రత్తలో లేదు. ఒక్క దినములోనే రెండు అవస్థలు ఒకదానికొకటి విరుద్ధముగా కలుగుతున్నాయి. ఇట్టిక్షణ భంగురమైన సత్యాన్ని మనం విశ్వసించి శాశ్వతమైన సత్యాన్ని విస్మరించటం మానవత్వానికి తగిన అర్థం కాదు. కనుకనే వేదములన్నీ ఇట్టి దివ్యత్వాన్ని ప్రబోధించి మానవుని మానవుడుగా జీవించమని కోరుతూ వచ్చింది. ఈ విధమైన అంతరార్థములతో కూడిన వేదము కేవలము ఒక మంత్రము మాత్రమే కాక దీనికి తగిన ప్రబోధలు కూడా ఇందులో ఇమిడి ఉన్నాయి. కర్మోపాసన, జ్ఞానకాండలన్ని కూడను వేదములో ప్రధానమైన రాజ మార్గములు. సాటి మానవులయొక్క సహజత్వము, సానుభూతి చూపటమే మానవునియొక్క ప్రధానతత్త్వమన్నారు. తోటి మానవులు బాధపడుతుండగా వారిని చూసి సరియైన ఆదర్శమును అందించాలి. సహకారమును, సానుభూతిని చూపాలి. ఈ విధమైన భావములీనాడు మానవునియందు కనిపించటం లేదు. కేవలం స్వార్థము, స్వప్రయోజనము పెరిగిపోయి విశాల భావములీనాడు విస్మరిస్తూ పోయినారు. మానవుడు విశాలమైన తత్త్వాన్ని అర్థం చేసుకోవాలి.

**దేహమును నావగా భావించండి**

వింటున్నాము దినము ఎన్నో మంచిమాటలు. చూస్తున్నాము ఎన్నియో మంచి కర్మలు. కాని ఒక్కటైనా మనలో నిలువగల్గుతోందా? లేదు. కేవలం ఈ విధమైన జీవితము ఎన్ని చూసినా వినినా ఎంతకాలము ఉండినప్పటికిని నిరుపయోగమైనవే. ఏకించిత్తైనా మనలో జీర్ణింపచేసుకునే శక్తిని మనం సంపాదించాలి. మానవత్వం చాలా పవిత్రమైనది. దివ్యమైనది. జీవించతగినది. చాలా విలువైనది. ఇట్టి విలువైన జీవితాన్ని మనం వ్యర్థము గావించుకోరాదు.

srisathyasaivachanamrutam

భౌతికమైన సుఖసంతోషములే ప్రధానముగా ఎంచరాదు. ఇవి కదలిపోయే మేఘముల వంటివి. చెదిరిపోయే మేఘముల వంటివి. దీనిని ఆధారముగా తీసుకుని మనము జీవితం సాగించటం సరియైనవి కాదు. అయితే ఈ లోకములో మనం ఉండవలసిందే. ఈ లోకమును వదలుటకు వీలుకాదు. దీనిని ఒక ఆధారంగా ఆదర్శంగా తీసుకుని జీవితమనే సాగరం దాటటానికి ప్రయత్నించాలి. నావను ఆధారం చేసుకుని గట్టునకెలా చేరుతున్నామో, దేహమనే నావను ఆధారంగా చేసుకొని దివ్యత్వమనే ఆత్మతత్త్వాన్ని మనం చేరాలి. ఇదే మన ప్రయాణముయొక్క రహస్యము ఎక్కడ నుండి వచ్చాము? ఎక్కడికి పోతున్నాము? ఏమి చేస్తున్నాము? ఇది ఏమాత్రము మనం విచారించటం లేదు. చిన్న విషయాలలో మీరు ఎంతో విచారించవచ్చు. ఒకరికి లెటర్ వ్రాసి దానిని కవరులో పెట్టి అందించి దానిని పోస్టు బాక్సులో వేస్తే అది ఎక్కడికి పోతుంది. జాబేమో వ్రాసినావు. విలువైన కవరులోనే పెట్టినావు. పోస్టు చేశావు కాని అందులో ఫ్రం అడ్రస్ లేదు, టు అడ్రస్ లేదు. ఫ్రం అడ్రస్ ఉంటే తిరిగి నీకైనా చేరుతుంది. లేక టు అడ్రస్ ఉంటే వానికైనా చేరిపోతుంది. రెండు లేని లెటర్స్ ఏమి చేస్తారు. Dead letter office లో వేస్తారు. కాల్చి వేస్తారు. కనుక మీ జీవితములంతా ఇదే రీతిగా ఉంటున్నాయి. మనము ఎక్కడనుండి వచ్చాము మనం తెలుసుకోటం లేదు. మన ప్రవర్తన ఆధారము చేసుకొని మనము ఎక్కడ పోవుమని టు ఎడ్రస్సును తెలుసుకోటం లేదు. ఉన్నచోటే ఉన్నాము. ఈ విధముగా వ్యర్థము గావించుకుంటున్నాము. ఇది సరియైనది కాదు. విచారణ చెయ్యాలి. చిన్నచిన్న విషయాలు సైన్సులో పరిశోధన చేస్తూ ఉంటారు.

ఈ భౌతికమైన పరిశోధనలో వచ్చిన ఫలితము ఏమిటుంది మనకు. మంచి ఉత్తమ డిగ్రీని పొందవచ్చును. ఉత్తమ ఉద్యోగములు చేయవచ్చును. కావలసినంత ధనము సంపాదించవచ్చును. ఆ ధనముతో భౌతికమైన సుఖములు పొందవచ్చును. అంతే నా దీనియొక్క లక్ష్యము. ఇదేనా జీవిత అంతరార్థము. కాదు కాదు కాదు. మనము వచ్చినటువంటి తత్త్వము చక్కగా అర్థము చేసుకోటానికి ప్రయత్నించాలి. ఎవరికి వారంతా what is the purpose of life ఈ జీవితము యొక్క రహస్యము ఏమిటి? అంతరార్థము ఏమిటి అని ప్రశ్నించుకోవాలి. ఏ ప్రశ్నలు వేసుకోటం లేదు. ఏ విషయమును మనం విచారించటము లేదు. తనకు తగిన విషయాన్ని అనవసరమైన విషయాలని అంతకూడను ప్రొద్దున న్యూస్ పేపరు వచ్చిందంటే

గంటసేపు దానిని కూర్చుని చదువుతూ ఉంటావు. ఏ దేశములో ఏ రాష్ట్రములో ఎవరివల్ల ఏమి జరిగిందో అన్నీ తెలుసుకుంటు ఉంటాం. తననుంచి న్యూస్ వస్తున్నదా న్యూసెన్సు వస్తున్నదా చూసుకోటం లేదు. తనదానిని తాను చూసుకోకుండా జగత్తుయొక్క విషయాన్ని తెలుసుకుంటే వచ్చే ఫలితమేమిటి? కనుకనే వేదాంతమునందు తనను తాను తెలుసుకోమని చెప్పింది. తనను తాను తెలుసుకున్నవాడే సర్వము తెలుసుకోగలడు.

ఈ తెలుసుకునే విధానం తగిన వారివద్ద చేరి వారి సలహాను తీసుకొని తద్వారా మీరు సరియైన అర్థాన్ని గుర్తించటానికి ప్రయత్నించాలి లేక ఇవన్నీ వ్యర్థమని మీరు భావించినప్పుడు కేవలము విశ్వాసమైనా పెంచుకోవాలి. ఏ విశ్వాసాన్ని! దైవవిశ్వాసము లేకపోయినా ఫరవాలేదు. మిమ్మల్ని మీరు విశ్వసించే విశ్వాసము పెంచుకోవాలి. తనను తాను నమ్మనివాడు ఎవ్వరినీ నమ్మలేడు. తనను తాను విశ్వసించుటమే పెద్ద నమ్మకము. తద్వారా ఇంక దేనినైనా విశ్వసించవచ్చు. ఈనాడు దైవమును విశ్వసించని వాడెవరంటే తనను తాను విశ్వసించనివాడే దైవాన్ని విశ్వసించడు. కనుక విశ్వాసమే మన శ్వాసముగా భావించాలి. విశ్వాసము లేనివానికి శ్వాసము ఉండదు. అలాంటివాడు living death జీవించి మృతుడైనవాడు. కనుక ఆవిధముగా మనము జీవించరాదు. దివ్యమైన భావాన్ని మనం అభివృద్ధిగావించుకోవాలి. కనుక

**భజగోవిందం భజగోవిందం గోవిందం భజ మూఢమతే**
**సంప్రాప్తే సన్నిహితే కాలే నహి నహి రక్షతి డుకృఞ్కరణే**

అటులనే ఈ విద్యలన్నీకూడను అంత్యములో మీరెంతస్మరించినప్పటికిని ఇవి మిమ్ములను రక్షించవు. ఒక్కదైవమే సర్వరక్షకుడు. రక్షించే దైవాన్ని మనము స్మరించాలి. కాని బాధించే వానిని స్మరించటంచేత మరింత బంధనలో మునిగిపోతాము. కనుక ఈ భావమునుదాటే మార్గానికి ప్రయత్నించండి.

**(తేది. 06-10-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam